'కాలం కలిసివస్తే నడిచొచ్చే కొడుకు పుడ్తాడట!' కలిసిరాకపోతే కొడుకు పుట్టడం అటుంచి ... కాదు... దేనికైనా కాలం కలిసి

# కాలం కలసి వచ్చింది

'బుధ'

రావాలి మరి !



నా మటుకు నేను ఎవ్వరితో పోట్లాడి ఎరగను. నాకు ఎవ్వరిపైనా ద్వేషం లేదు....నాపై కూడా ఎవ్వరికీ ద్వేషం లేదనే నా ఉద్దేశ్యం.

ఒకరిద్దరు నాకు కీడు తలపెట్టినా, నష్టము కల్గించినా, బాధ పెట్టినా... వారి కెలాంటి అపకారము తలపెట్టలేదు. నిజానికి ఇప్పుడు నా కెవరో కీడు తలపెట్టలేదు....నా కిప్పుడు కాలం కలసి రాక నడిచొచ్చే కొడుకు పుట్టాడు.

*****************

"అన్నా! నీ వెందుకింకా పెళ్లి చేసుకోలేదు" పార్కులో నన్ను ప్రసాద్ అడిగాడు. ప్రసాదు నా కన్నా ఎంతో చిన్న - కానీ రోజూ కలవడంవల్ల మా యిద్దరి మధ్య మంచి 'ఫ్రెండ్‌షిప్' ఏర్పడింది.

ఆ సమయంలో మా మాటలు వినబడేంత దూరంలో మురళి ఉన్నాడు. మురళికి నాకూ పరిచయంలేదు.... కాని మురళి సుప్రియ తమ్ముడు.

నాలో కాస్త కొంటె బుద్ధి పుట్టింది. వెంటనే పర్యవసానం ఆలోచించకుండా - "పెళ్లెందుకు చేసుకోనా!?....రెండో పెళ్లి ఎవరైనా చేసుకుంటారా!? నా కిప్పుడు నడిచివచ్చే కొడుకున్నాడు....వాడికేం పేరు పెట్టాలోనని ఆలోచిస్తున్నా!" మురళి చెవిన పడాలనే కాస్త గట్టిగా అన్నాను.

"ఓహో!...." ప్రసాదు అర్థాంతరంగా లేచి వెళ్లిపోయాడు.

అప్పుడు ప్రసాదు ఎందుకలా వెళ్లిపోయాడో, తర్వాత అర్థమైంది నాకు.

సుప్రియను ఏడిపించాలనే ఉద్దేశ్యంతో అలా అసత్యం చెప్పాను.

సుప్రియ నన్ను ప్రేమిస్తోంది.

నేను సుప్రియను ప్రేమిస్తున్నాను.

మా ప్రేమకు మాటలు రాలేదింకా.....

కానీ, మా కనులు మాటాడుకుంటాయి. మా మనసులు దోబూచులాడుకుంటాయి.

సుప్రియ, లత ఇద్దరూ పార్కుకు వస్తారు. అందరం ఒకే కాలనీ వాళ్లమే కాబట్టి ఎవరు ఎవరింటి వాళ్లో అందరికి తెల్సు. అట్లాగని ఎవరి పూర్తి వివరాలూ ఎవరికీ తెలియవు.

నా వాలకం, సుప్రియ ఆలోచనలు లత పసికట్టేసింది. ఇంకేం మరో యిద్దరి స్నేహితురాళ్లకి కూడా తెల్సిపోయింది ఆ సంగతి.

ఆ రోజు సుప్రియ పార్కుకు రాలేదు.

చీకటి పడేదాక ఉండి నేను వెళ్లిపోయాను.

*****************

మరుసటి రోజు సాయంత్రం కూడా పార్కుకు వెళ్లాను నేను.

ఆరోజు ప్రసాదు రాలేదు.

కాసేపటికి సుప్రియా, లత వచ్చారు.

సుప్రియ నల్లటి దుస్తులు వేసుకుంది.

"ఏమిటే! ఏమైంది నీకు!!" లత అడిగింది. లత మాటలు నాకు వినబడ్డాయి.

సుప్రియ మోకాళ్లపై తల ఆన్చింది.

సుప్రియ ఏం జవాబు చెప్పిందో నాకు వినబడలేదు....

లత మాత్రం వినకూడనిది విన్నట్టు చెయ్యితో నుదిటిని పదే పదే కొట్టుకుంది.

సుప్రియ కళ్లు తుడుచుకుంది. ఆమె కదలికలు చూసి ఏడ్చిందని - కన్నీళ్లు తుడుచుకుందని గ్రహించాను.

అంతే! వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

నాకేమిటో అర్థం కాలేదు విషయం.

సుప్రియకు పెళ్లికి ఏర్పాట్లు జరుగుతున్న విషయం నాకు తెల్సు.... ఏదైనా పెళ్లి చూపులను ఎదుర్కోవాలని బాధ పడుతోందేమో!

ఇలా నేనెందుకు అనుకుంటున్నానంటే సుప్రియ నన్ను ప్రేమిస్తోందని కచ్చితంగా తెల్సు కనక. అందుకు సాక్ష్యం ఏదీ అని అడగకండి - ఇలాటి వాటికి సాక్ష్యాధారాలు ఉండవు మరి. అటువంటి విషయాలు ఎవరికి వారే అనుభవాన తెల్సుకోవాలి.

సుప్రియను చూసినప్పుడు నా మనసు చాలా చిత్రంగా నాట్యం చేస్తుంది.

చల్లని వెన్నెల్లో విహరించే పక్షిలా, ఆనందసాగరంలో కెరింతలు కొడుతూ, సుందర మనోహర ఉద్యానవనంలో ఆడి పాడి అలసిపోయినట్లు తన్మయత్వంలో మునిగిపోతుంది నా మనసు. ఆమె కనబడిన వెంటనే అదో ఆనందం.... ఉల్లాసం... ప్రశాంతం....తన్మయత్వం.... అనురాగం...నామనసులో అదో స్పందన... ప్రతిస్పందన....అప్పుడు నా మనసొక పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తూంటుంది. ఇవన్నీ నేను సుప్రియను ప్రేమిస్తున్నాననేందుకు ఋజువులు అని మీరంటారని తెల్సు.

ఆమె నన్ను ప్రేమిస్తోందని నేనెలా అనుకున్నానంటే -

ఆమె వస్తూంటుంది.

నాలో ఆనందం వెల్లువుకుతూంటుంది. అప్పుడెవరైనా నా పక్కన ఉంటే -

"ఆమె నన్ను ప్రేమిస్తోంది - అటు చూడండి! అందుకు సిగ్గుపడే ఆమె కనురెప్పలే సాక్షి."

"ఆమె ఆరాధిస్తోంది - అటు చూడండీ! అందుకు రెప్పల బరువుతో తటపటలాడిస్తూ నన్ను చూసే ఆ చూపులే సాక్షి."

"ఆమె నన్నే సర్వస్వంగా ఎంచి నా ఎదలో ఒదిగిపోవాలని వస్తోంది - అటు చూడండీ! అందుకు తన్మయత్వంగా తన్ను తాను మరిచిపోయి నా వేపు వేసే ఆ అడుగులే సాక్షి."

అంతే మీకు కనిపించేది.

నాలుగు కన్నులు రెండవడమూ -

రెండు హృదయాలు ఒకటవడమూ -

ఆమెకు తెల్సు - నాకు తెల్సు - ఇది మీకు తెలియదు.

ఇంత జరిగినా - ఆమె కౌగిలి కోసం నేను తపించడం లేదు - నా స్పర్శకోసం ఆమె ఎదురు చూడడంలేదు.... మా మధ్య ఏదో మధుర భావన - అసలు ఆ మధుర భావన 'ఉందో' 'లేదో!' తెలియనట్టు మమ్ములను మేము మరచిపోతాము ఇరువురం ఒకటవుతాము.

*****************

వారం రోజులు సుప్రియ రాలేదు.

ఆ వారం రోజులూ నా ఆవేదన వర్ణనాతీతం.

సుప్రియకు పెళ్లి నిశ్చయం అయిందా!? నాకు తెలియదు - తెలిసేందుకు ప్రసాదు పార్కుకు రావడం లేదు - నాకో అనుమానం వచ్చింది. మురళి నేను ప్రసాదుతో అన్న మాటలు సుప్రియ చెవిన వేస్తే సుప్రియ నాతో పోట్లాడేందుకు వస్తుందనుకున్నా! - ఇంకెవరో చెవిన వేసుంటాడు - సుప్రియకు చివాట్లు పడుంటాయి - ఏమి జరిగిందో -తెరవెనుక - సుప్రియ నాతో పోట్లాడేందుకు వస్తే నిజం చెప్పి 'సారీ' చెబుదామనుకున్నా కానీ ఏదీ! . పరిస్థితి చూస్తుంటే పూర్తిగా చేయి జారినట్టుంది.


## వినాయక చవితి సంచిక

24-8-'90 సంచిక

ప్రత్యేక శీర్షికలు, కథలు

ఒక క్రొత్త సీరియల్, మరికొన్ని విశేషాలు

"ఏమిటి మేష్టారూ! ఒక్కరే ఏదో ఆలోచిస్తున్నారు!?" సత్యం వచ్చాడు.

సత్యం మూర్తిగారి కొడుకు. మూర్తికి నాకు కథల పరిచయం. మూర్తీ నేనూ ఇద్దరం పోటీలకు కథలు పంపేవాళ్లం - ఒకసారి మూర్తిది, ఒకసారి నాది సెలెక్టు అయ్యేవి.

"ప్చ్! ఏం లేదండీ!"

"మీ కోసం ఇంటికి వెళ్లాను.... మీ రిక్కడుంటారని చెబితే ఇక్కడికొచ్చాను. మా నాన్న మీతో మాట్లాడాలన్నారు.... మీరు ఇక్కడే ఉంటారా?"

"ఇక్కడ ఉండడం ఎందుకు? మీ యింటికే వస్తా!" లేవబోయాను.

"అబ్బే! అక్కడ లేము...ఇల్లు మార్చాము.... మీరిక్కడే ఉండండి... నాన్న వస్తారు."

"సరే....ఉంటాగా! మళ్లీ ఏదైనా కథల పోటీ వుందా?" నా మాటలు సత్యం చెవిని చేరలేదేమో జవాబు రాలేదు.

చీకటి పడుతూ ఉంది.

సుప్రియ రాకపోవడంవల్ల నా హృదయంలో చీకటి అలముకొనే ఉంది.

ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉన్నాయి. మబ్బులు లేనిచోట నక్షత్రాలు మినుకు మినుకు మని మిడిసిపాటు పడుతున్నాయి.

"ఏమిటి ప్లాటు ఆలోచిస్తున్నారా?" మూర్తిగారు దూరం నుంచే అన్నారు.

"అబ్బే! మూడ్ బాగా లేదు...."

"అయితే ఇంకేం - మూడ్ బాగా అవుతూనే కథ రాసేస్తారనేగా!"

"ప్చ్!" ఎలా సంభాషణ సాగించాలో అర్థంకాక అన్నాను.

"సరేగానీ కవిగారూ - మా పక్కింట్లో మీ పేరు పదే పదే వినిపిస్తోం దేమిటి!? - వాళ్ల అమ్మాయి సరిగా అన్నం తినడం లేదట - అసలు విషయం ఏమిటీ?' '

"ఏముంది - మీరూ కవే గదా - అక్కడ అమ్మాయి - ఇక్కడ అబ్బాయి - కొంత కాలం ఆమె నేనూ 'ఒకటి'గా ఇప్పుడు ఆమె 'ఆమె'లా నేను 'నేను'లా మామధ్య దూరం 'దూరం'లా ఉంటోంది...." నిట్టూర్చాను నేను.

"అంటే!"

"మరోలా భావించకండీ! మా మనసులు ఏకమయ్యాయి - శరీరాలు కాదు సుమా!"

"ఓహో! అక్కడి పెద్దలో ఇక్కడ పెద్దలో అడ్డుపడ్డారన్న మాట." సిగరెట్టు



వెలిగించాడు మూర్తి.

"నా మాటే పెద్దల మాట కూడా! అక్కడే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి - నే నొక రోజు 'తమాషా'చేద్దామని నాకు నడిచొచ్చే కొడుకు వున్నాడని - వాడికేం పేరు పెట్టాలోనని ఆలోచిస్తున్నానని ఆ సుప్రియ తమ్ముడికి వినబడేలా అన్నాను - ప్రసాదనే అబ్బాయితో!"

"ప్రసాదా! - సుప్రియకు దూరం చుట్టమేగా - ఆ పిల్లాడు నీ గురించి వివరాలు సేకరించడానికి వచ్చాడోయ్ - నీ విషయం వాళ్లు దృష్టిలో పెట్టుకొనే




వాడ్ని పంపారు నీ దగ్గరికి."

"అయ్యయ్యో! ఎంత పని జరిగింది!"

"జరగదా మరి!...ఎంత పొరపాటు చేశావు - అమ్మాయిల్ని ఏడిపించడానికి కూడా అనుభవం ఉండాలి - ఎలాబడితే అలా ఏడిపించాలని ప్రయత్నిస్తే ఇలాంటి అనర్థాలే జరుగుతాయి. నీవేమో ఒక వైపు అవస్థపడుతున్నావా? ఆ అమ్మాయి పాపం నిన్ను మనసారా ప్రేమించి - ఇప్పుడు భవిష్యత్తు అంధకారంగా తోచి ఆహార పానీయాలు వొదిలేసింది మరి - ఆ అమ్మాయిని చూసి ఆ తల్లిదండ్రులు ఒకటే ఆందోళన చెందుతున్నారు."

"ఏంటేంటీ!'తమాషా'కన్న మాటల్ని అంత సీరియస్‌గా తీసుకుంటారనుకో లేదు"

"సీరియస్ కాదేమిటయ్యా! సర్లె సర్లె - అయినా - మన స్త్రీల మనస్సు ఎంత సున్నితంగా ఉంటుందో నీకు తెలియదా - మరో స్త్రీకి అన్యాయం చేయగూడదని పెళ్లయిన వాడి జోలికి రాదు - కానీ ఆ ఇంగితజ్ఞానం మగవాళ్లకే లేదు. పెళ్లయినవాళ్లను....పిల్లలున్న వాళ్లను...ఎవడినో బడితే వాడిని ప్రేమించడానికి....ఎవడితో బడితే వాడితో అక్రమ సంబంధం ఉంచుకోడానికి మన సంప్రదాయం సంస్కృతి ఇంకా దిగజారలేదయ్యా! సరె సర్లే! ... ఒక స్త్రీ ఒకడిని ప్రేమించిందంటే అతని పై ఎంతో విశ్వాసం ఏర్పరుచుకున్నాకనే - సరెసర్లే! ప్చ్!! మొత్తానికి ఆ అమ్మాయి మనసును తీవ్రమైన క్షోభకు గురి చేశావయ్యా!....వెంటనే వెళ్లి క్షమాపణ చెప్పుకో!!" ఏకబిగిన మూర్తిగారు నాపై విరుచుకపడ్డారు.

"సారీ!...."

"నాకు చెప్పడం కాదు.... వెళ్లి వారికి చెప్పు."

"నే నెలా చెప్పేది...."

"కాబోయే పెళ్లానికి అత్తమామలకు అలా దూరం ఉంటారేమిటయ్యా!"

"నాకింకా వాళ్లతో సరైన పరిచయం కూడా లేదు - పై పెచ్చు నాకు నడిచొచ్చే కొడుకున్నాడని - ప్చ్"

"సరే! నేనే మాటల సందర్భంలో చెబుతాలే!" అందాక నీవూ అనుభవించు. మరో సిగరెట్టు అంటించారు మూర్తిగారు.

"మీరు - వాళ్లకెలా పరిచయం."

"అద్దింట్లో వుండాల్సిన వాడినిగా - పది రోజులయింది వాళ్లింటి వాటాలో చేరి - సరె సరేలే! నీవు పెళ్లి కాకుండా - ఎంత నడిచొచ్చే కొడుకు పై మోజుంటే మాత్రం అలా చెప్పుకుంటే ఎలా - అసలు నీ కెలా పెళ్లవుతుందనుకున్నావ్?"

"నాకేం తెల్సండీ!"

"సరే పద - చీకటి పడింది" మూర్తిగారు లేచారు.

నేనూ అనుసరించాను.

*****************

ఆరోజు రాత్రి మా తొలిరాత్రి.

"ఏమండీ! మీ నడిచొచ్చే కొడుకు ఎక్కడ" సిగ్గుపడుతూ అడిగింది సుప్రియ.

"అప్పుడు కాలం కలసి రాలేదుగా - ఇప్పుడు వచ్చింది" నాపైకి లాక్కున్నాను సుప్రియను.